# అడల్ట్స్ ఓన్లీ కథ



# శ్రీనివాస రమణీయం

డా. తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

చేతిలో పాలగ్లాసూ, పెళ్ళికూతుర్ని గదిలోకి నెట్టి కిలకిల నవ్వే ముత్తైదువలూ వంటి సాంప్రదాయిక హంగులేవీ లేకుండా గులాబి రంగు వెంకటగిరి నూలు చీర, జరీ అంచువున్నది కట్టుకుని, తలలో రెండు మూరల మల్లెపూల దండ ముడుచుకుని పూల సుగంధాలు వెదజల్లుతూ దడదడ లాడుతున్న గుండె చిక్కబట్టుకుంటూ గదిలోకి అడుగు పెట్టింది రమణి.


ఆరోజు ఉదయం పది గంటలకే మాంగల్యధారణ ముహూర్తం అవడంతో, భోజనాలు అయ్యాక సాయంకాలం వియ్యాలవారు తిరుగుప్రయాణం కట్టారు. పెళ్ళికొడుక్కి సాయంగా అతనికి వరసకి పిన్ని, చిన్నాన్న అయ్యే జంటను మాత్రం పెళ్ళివారింట్లో వదలి వెళ్ళారు.

పెళ్ళి జరిగిన సత్రంలోనే సాయంకాలం పెళ్ళి కుమార్తెతో అయిదుమంది ముత్తైదువులకు ఫల తాంబూలాలు ఇప్పించే కార్యక్రమం కూడా ముగించేసాడు పురోహితుడు.

రాత్రి భోజనాలు అయ్యాక కొత్త దంపతులను మాత్రం ఇంటికి తీసుకు వచ్చారు. కూడా వచ్చిన పెళ్ళికూతురి అక్కా బావా, పెళ్ళికొడుకు పిన్నీ బాబాయి వధూవరులను కూర్చోబెట్టి అమ్మాయికి అత్తగారు కొన్న చీర రవిక, అబ్బాయికి మామగారు కొన్న బట్టలు చదివించి, హారతిచ్చి ఇక గదిలోకి పదమన్నారు.

అలా గదిలోకి వచ్చిన రమణి పతిదేవుడు వచ్చి తలుపులు గడియ వేస్తాడని ఎదురుచూడకుండా తనే తలుపు గొళ్ళెం పెట్టి, విశాలమైన ఆ గదిలో కుదురుగా ఒక మూలన వున్న డబుల్ కాట్ వైపు చూసింది శ్రీనివాస్ ఏం చేస్తున్నాడా అని.

కానీ ఆమె ఊహించినట్టు మంచం మీద కూర్చుని, పూల వాసనలు ఆఘ్రాణిస్తూ అసహనంగా తనకోసం ఎదురుచూస్తూ అగుపించలేదు



శృంగార కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన రచన

శ్రీనివాస్.

తల పక్కకు తిప్పి చూస్తే మంచానికి ఆరడుగుల దూరంలో వున్న సోఫామీద కూర్చుని కనిపించాడు.

పెళ్ళితంతు జరిగినంతసేపూ కుచ్చులు పోసి కట్టిన పంచె కట్టులో, పైన అంగవస్త్రం, తలకు జరీ పాగా, నుదుటిన బాసికం వగైరా అలంకరణలో మరుగున పడిన అతని ఆకర్షణీయమైన రూపం తెల్లని లాల్చీ పైజమాలో కనులకింపుగా తోచింది రమణికి.

సినిమాలలోలాగా ఫలహారపు పళ్ళేలు, మంచం ఫ్రేముకు వ్రేలాడే పూల మాలలూ వగైరా ససేమిరా వద్దని రమణి చెప్పడం వలన ఆ సరంజామా ఏమీ గదిలో కనబడలేదు.

మంచం పక్కన వున్న చిన్న గుండ్రని బల్లమీద ఫ్లాస్క్‌లో పాలు, పక్కన రెండు గ్లాసులూ పెట్టింది రమణి అక్క. ఆ పక్కనే పరిమళాలు వెదజల్లుతున్న అగరవత్తులున్న వెండి గిన్నె వుంది.

అయితే మంచం మీద మాత్రం చాలా అందంగా, కళాత్మకంగా మల్లెపూలు గులాబిరేకులతో నెమలి జంటను చిత్రించారు. మంచం దగ్గరగా వెళ్ళి నిలబడి అద్భుతంగా కనబడుతున్న ఆ పూవుల నెమలి జంటను చూస్తూ నిలబడిపోయింది రమణి.

ఆ తరువాత చిరునవ్వుతో శ్రీనివాస్ వైపు తిరిగింది.

''మంచం మీద కూర్చుంటే నేను వచ్చేలోపుగా ఆ కమనీయ దృశ్యం చెదరిపోతుందేమోనని భయపడి దూరంగా సోఫాలో కూర్చుని చూస్తున్నారా?'' అని అడుగుతూ అతని వైపు రెండడుగులు వేసింది.

తన శరీరం రంగుతో పోటీ పడుతున్నట్టున్న గులాబి రంగు చీర కట్టి, మెడలో గౌరి పూజ చేసినప్పుడు వాళ్ళమ్మ కట్టిన మాంగల్యం, ముహూర్తమప్పుడు తను మూడు ముళ్ళు వేసిన తాళి, నాకబలి సందర్భంలో ఆమె మెడలో వేసిన నల్లపూసల గొలుసు, రెండు చేతులకు బంగారు గాజుల నడుమ గలగలలాడుతున్న ఆకుపచ్చని గాజులు, చేతులకు ఎర్రగా పండిన గోరింటతో రమణీయంగా వున్న రమణివైపు నుండి చూపులు తిప్పకుండానే ''ఆ... అవును..చాలా బాగా వేసారు. ఆ నెమలి జంటను..'' కుడిచేతి చూపుడు వేలితో ముక్కు నలుపుకుంటూ ముఖేష్ గొంతుతో పలికాడు శ్రీనివాస్.

కొత్తగా వినబడిన ఆ గొంతు తమాషాగా అనిపించింది రమణికి. ''అదేమిటీ గొంతలా వుందే?'' అన్న ప్రశ్నను కళ్ళతోనే అడుగుతూ మరి కాస్త దగ్గరికి వచ్చిన రమణి శ్రీనివాస్ కళ్ళు ఎర్రబడి వుండడం గమనించింది.

'పాపం! ఈరోజు గురించిన టెన్షన్‌తో నిన్న రాత్రి నిద్ర పోలేదేమో' అన్న ఊహ మనసులో మెదలి ఆమె కళ్ళలో చిలిపిదనం తొంగి చూసింది. 'ఆ మాటకొస్తే తను మాత్రం నిద్రపోయిందా?' అనుకుని నవ్వుకుంది. ఆమె దగ్గరికి వస్తుండగానే శ్రీనివాస్ లేచి నిలబడ్డాడు.

''ఒక్క నిముషం అక్కడే కూర్చోండి. ఇంత అపురూపమైన కళను చిరకాలం గుర్తుండిపోయేలా దాచుకుందాం!'' అంటూ చక చక వెళ్ళి అల్మైరాలో వున్న 'కామ్ కార్డర్' తీసుకువచ్చి వివిధ కోణాల నుండి ఆ నెమలి పూల జంటని అందులో చిత్రించి నిక్షిప్తం చేసింది.

వెంటనే రివైండ్ చేసి ఆ చిన్న స్క్రీన్ మీద చూస్తూ ''వావ్..వండర్‌ఫుల్..చూడండి ఎంత గొప్పగా వచ్చిందో'' ఆనందోత్సాహాలతో శ్రీనివాస దగ్గరికి వచ్చి, అతని ప్రక్కన ఆనుకున్నట్టుగా నిలబడి అతడికి చూపించింది.

''నిజంగా చాలా బాగుం...హాచ్'' అన్నాడు శ్రీనివాస్ 'ది'ని తుమ్ముతో కలిపేసి.

రమణి తలలో సుతారంగా కదులుతున్న మల్లెపూల దండను చూస్తూ జేబులో నుండి రుమాలు తీసుకుని ముక్కు తుడుచుకుంటూ కాస్త దూరంగా జరిగాడు.

''అదేమిటి? జలుబు చేసిందా?'' ఆదుర్దాగా అడుగుతూ ముందుకు రాబోయింది రమణి.

''ఆ..అలాగే వుంది. దగ్గరకు రాకు..నీకూ అంటుకుంటుంది'' అంటూ రెండడుగులు అటువైపు వేసి, దూరంగా నిలబడ్డాడు.


''వుండండి. నేను వెళ్ళి ఏదన్నా మాత్ర వుంటే తెస్తాను'' అంటూ తలుపు వైపు కదిలింది రమణి.

''అవేమీ నాకు పనిచేయవు. నువ్వు బయటకు వెళ్ళకు'' కంగారుగా చెప్పాడు శ్రీనివాస్.

మళ్ళీ అతనే చెప్పాడు ''సారీ! ఇలా జరిగింది. దగ్గరకు వచ్చావంటే నువ్వూ అవస్థ పడాల్సి వస్తుంది. అలా ఆ కుర్చీలో కూర్చో..కబుర్లు చెప్పుకుందాం కనీసం!''

## ఆనందమానందమాయె!

**ఇంతకాలం కేవలం గ్లామర్ డాల్‌గానే వేషాలేస్తూ వస్తున్న అందాల సుందరి నమితకి ఇప్పుడు తనకి వచ్చిన ఆఫర్‌కి తెగ సంబరపడుతోంది. తమిళంలో నమితకి ఓ కొత్త చిత్రంలో హీరోయిన్ చాన్స్ వచ్చింది. కాళిముత్తు దర్శకత్వంలో 'మిన్నల దిక్కాదు' అనే తమిళ చిత్రంలో పాత్ర నమితకి ఎంతో వెరైటీ అవుతుందని దర్శకుడితో పాటు నమిత కూడా అంటోంది. నటనలో తన టాలెంట్‌ని ప్రూవ్ చేసుకోడానికి ఇంతకంటే మరో చాన్స్ వుండదని, దీంతో తనేంటో నిరూపించుకుంటానని బోల్డు ఆనందపడిపోతోంది నమిత. ఈ సినిమా తర్వాత అయినా నమిత కెరీర్ మరో మలుపు తిరుగుతుందేమో!**



అన్నాడు నొచ్చుకుంటూ.

రమణి బుగ్గలు ఎరుపు రంగుకు తిరిగాయి ఆ మాటలు విని. ''కబుర్లకేం రోజూ చెప్పుకోవచ్చు లెండి మీరు రెస్ట్‌గా పడుకోండి'' అంది మంచం వైపు చూపిస్తూ.

''వద్దొద్దు..నువ్వక్కడ పడుకో. నేనీ సోఫాలోనే నిద్రపోగలను'' అని కంగారుగా అంటూ మళ్ళీ ముక్కు తుడుచుకున్నాడు.

''సారీ..'' అన్నాడు మరోసారి.

''ఇప్పుడేమయిందని? మన మధ్య 'సారీ'లు దేనికి? వుండండి తలగడ తెచ్చిస్తాను'' అంటూ వెళ్ళి తీసుకు వచ్చింది.

''హాచ్..గుడ్‌నైట్'' అని తుమ్ముతూ చెప్పి పడుకున్నాడు శ్రీనివాస్.

★ ★ ★

రెండో రోజున శ్రీనివాస్ పిన్నీ బాబాయి ఇక తమ అవసరం లేదన్నట్టుగా ఊరికి ప్రయాణమయ్యారు.

## గడసరి పిల్ల సంధ్య!

**'ప్రేమిస్తే' సినిమాతో సంచలనం సృష్టించిన టీనేజీ గ్లామర్ సంధ్య తను ఇకపై చెల్లెలి వేషాలు వేయనంటోంది. పవన్ కల్యాణ్ 'అన్నవరం' సినిమాలో సంధ్య చెల్లెలుగా నటిస్తోంది. ఈ ఒక్క సినిమా తప్ప ఇకపై తాను ఎలాంటి చెల్లెలి వేషాలూ వేయనని, హీరోయిన్‌గా నైతేనే నటిస్తానని మొహమాటం లేకుండా సెలవిస్తోంది. ఒకటి రెండు చెల్లెలి పాత్రలు ధరిస్తే ఇక అలాంటి తరహా వేషాలే ముందు ముందు వస్తాయని ముందుజాగ్రత్త తీసుకుంటోంది సంధ్య. వయసులో చిన్నదైనా కెరీర్ ప్లానింగ్‌లో మాత్రం గడుసుదే కదూ ఈ పిల్ల!**

ఆరోజు రాత్రి శ్రీనివాస్ గదిలోకి వచ్చేసరికి మంచం మీద పూలపానుపైతే లేదు గానీ అంతకంటే గొప్పగా పూతరేకులాంటి చీర కట్టుకుని, పొడుగాటి జడనిండా మల్లెలు కనకాంబరాలు మరువంతో మూడు రంగులతో ముచ్చటగా పూలజడ వేసుకుని గదిలోకి వచ్చింది రమణి.

''అమ్మ ముచ్చట పడిందని వేసుకున్నాను..'' అంది వయ్యారంగా పూలజడను ముందుకు తీసుకుని గుండెల మీద పడేలా వేసుకుంటూ.

శ్రీనివాస్ చూపులు జడమీదే చిక్కుకుపోవడం గమనించనట్టే ''ఈరోజు ఉదయం నుండీ మీకు జలుబు బాధ అంతగా వున్నట్టు లేదు కదూ? అయినా ఎందుకైనా మంచిదని మాత్ర తీసుకువచ్చాను'' అంటూ అతని చేరువగా వచ్చి మాత్ర అందించింది.

''తగ్గినట్టే అనిపించింది..'' అంటూ మళ్ళీ 'హాచ్' మని తుమ్మాడు శ్రీనివాస్. దూరం నుండే మాత్ర అందుకుని కృతజ్ఞతగా చూసి వేసుకున్నాడు.

''అలా కూర్చోకూడదూ?'' తను సోఫాలో కూర్చుంటూ ఆమెకు కాస్త ఎడంగా వున్న కుర్చీ చూపించాడు.

''నిన్న కంగారులో గుర్తుకు రాలేదుగానీ నాకు ఒక పట్టాన జలుబు చేయదు. మా ఇంటిల్లిపాదికీ పడిశం పట్టినా నాకు మాత్రం ఏమీ కాదు. గత అయిదారేళ్ళుగా ఒక్కసారి కూడా నాకు పడిశం పట్టిన జ్ఞాపకం లేదు. అంచేత మీ నుండి నాకు అంటుకుటుందని మీరేం భయపడనక్కర్లేదు'' అని చెప్తూ అతని పక్కన సోఫాలో కూర్చుంది రమణి.

మళ్ళీ రెండు తుమ్ములు తుమ్మాడు శ్రీనివాస్. అతని ముక్కు ఎర్రబడింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

''సారీ..వెరీ సారీ..'' అంటూ లేచి వెళ్ళి తనే కుర్చీలో కూర్చున్నాడు.

కాసేపు అవీ ఇవీ మాట్లాడుకున్నాక ఇంకో రెండు మూడు తుమ్ములు రావడంతో ''నేనిక్కడే పడుకుంటాను. నువ్వెళ్ళి మంచం మీద పడుకో'' అంటూ గుడ్‌నైట్ చెప్పాడు శ్రీనివాస్. కాస్త నిరాశగా చూసి మౌనంగా వెళ్ళి పడుకుంది రమణి.

★ ★ ★


మూడు రోజులూ ఇలాగే గడిచాక భర్తతో అత్తవారింటికి బయల్దేరింది రమణి.

పెళ్ళికూతురికి తోడుగా ఆమె అక్క శ్యామలను బావ సాయికుమార్‌ని పంపించారు.

కోడలి రాకతో కొత్త ఉత్సాహం పుంజుకున్న శ్రీనివాస్ తల్లి తన కొడుకు కోడళ్ళ ముచ్చటైన జంటను తన ఊళ్ళో వాళ్ళకు చూపించుకోవాలన్న ఆశతో కావల్సిన వారినందరినీ పిల్చి రిసెప్షన్ ఏర్పాటు చేసింది.

రమణిని, ఆమె అక్క శ్యామలను ఊళ్ళో ప్రసిద్ధి చెందిన బ్యూటీపార్లర్‌కి తీసుకువెళ్ళి నవ వధువుఅందంగా, మరింత ఆకర్షణీయంగా కనబడేట్టు అలంకారం చేయమంది. పొడవైన రమణి శిరోజాలను కొత్తరకంగా ముడివేసి ముత్యాలమాలతో అలంకరించింది పార్లర్ నడిపే ఆవిడ. అలాగే రమణికి ముఖాలంకరణ, పమిట చెంగు ముందుకు వచ్చేటట్టుగా బెంగాలీ చీర కట్టు కూడా అక్కడే చేయించి ఇంటికి తీసుకువచ్చింది రమణి అత్తగారు.

రిసెప్షన్ జరిగిన మూడు గంటల సేపు శ్రీనివాస్ చూపులు రమణి మీదే వున్నాయి. ముక్కు కారడం, తుమ్ముల బాధ లేకపోవడంతో తేటగా కనబడుతున్న ముఖంతో, రాజస్థానీ వారి సంప్రదాయపు దుస్తులలో రాకుమారుడిలా వెలిగిపోతున్న శ్రీనివాస్‌ని చూస్తూ మురిసిపోయింది రమణి.




రిసెప్షన్‌కి వచ్చిన ప్రతి ఒక్కరూ వధూవరుల జంట చూడముచ్చటగా వున్నదని మెచ్చుకున్నారు.

రాత్రి భోజనాలు అయ్యాక, వచ్చిన వారందరూ వెళ్ళిపోయాక కొడుకునూ, కోడలినీ లోపలి గదిలోకి తీసికెళ్ళి దిష్టి తీసింది శ్రీనివాస్ తల్లి.

అందరూ ఇళ్ళకు బయల్దేరేటప్పుడు రమణినీ, శ్రీనివాస్‌ని మాత్రం ఒక కారులో వేరుగా ఎక్కించారు.

''హ్యాపీ టైం..గుడ్‌నైట్..'' అంటూ ముసి ముసి నవ్వులతో చెప్పారు కొత్తజంటకు.

కారు కదిలేముందు రమణికి చిన్న జిప్ బ్యాగు అందించింది అక్క శ్యామల.

పల్లకీలా కదిలిన కారు ఒక స్టార్ హోటల్ ముందు ఆగింది.

''ఇదేమిటి? ఇంటికి వెళ్ళకుండా హోటల్‌కి తీసుకు వచ్చారు? అత్తయ్య మావయ్య ఏమనుకుంటారో?'' సందేహపడింది రమణి.

''ఇది అమ్మానాన్నగారూ కలిసి ఏర్పాటు చేసిందే..ఇంట్లో అందరూ

వుంటారు. నీకు మొహమాటంగా కొత్తగా వుంటుందని ఈ ఏర్పాటు చేస్తార్ర. మనకు కావలసినంత ఏకాంతం..'' రమణి నడుము చుట్టూ చెయ్యి వేసి ముందుకు నడిపిస్తూ చెప్పాడు శ్రీనివాస్.

మొదటి రాత్రి కన్నా ఎక్కువ కంగారుగా అనిపించింది రమణికి తమకు కేటాయించిన గదిలోకి అడుగుపెడుతుంటే.

'డోంట్ డిస్టర్బ్' బోర్డును తలుపునకు పెట్టి వినయంగా సెలవు తీసుకున్నాడు స్టీవార్డ్.

విశాలమైన గదిలో రెండు మంచాలను దగ్గరిగా వేసి మల్లెపువ్వులాంటి దుప్పట్లు పరిచి వుంచారు.

మంచాలకు ఒకవేపు నిలువెత్తు అద్దం వుంది.

గదిలో ఒక మూలకు టి.వి. వుంది. మరో మూలన రెండు సోఫాలు, ఒక గాజు టీపాయ్ వున్నాయి.

ఒక పక్కన ఫ్రిజ్ వుండడం చూసి ఆశ్చర్యపోయింది రమణి.

గోడలకు అక్కడక్కడ అజంతా ఎల్లోరాలలోని తైలవర్ణ చిత్రాలు తగిలించి వున్నాయి.

ఎ.సి. గది కావడాన చల్లగా హాయిగా వుంది.

ఆ ఆహ్లాదకరమైన వాతావరణం లాగానే శ్రీనివాస్ ముఖంలో కూడా క్రొత్త ఉత్సాహం కనబడుతూంది.

రమణి భుజాల చుట్టూ చేతులు చుట్టి మంచం దగ్గరికి నడిపించుకు వెళ్ళి కూర్చోబెట్టాడు.

''ఒక్క నిముషం'' అంటూ పక్కనే వున్న బాత్‌రూములోకి వెళ్ళాడు.

మంత్ర ముగ్ధలా అలా కూర్చుండిపోయింది రమణి. అయిదు నిముషాలలో ముఖం కడుక్కుని, బట్టలు మార్చుకుని వచ్చాడు శ్రీనివాస్.

''నువ్వు కూడా ఈ పట్టు చీర మార్చుకుంటే హాయిగా వుంటుందేమో'' అన్నాడు చిరునవ్వుతో.

''ఇలా జుత్తు ముడివేస్తే నీకు చాలా బావుంది'' అన్నాడు మళ్ళీ తనే.

''మీ అమ్మగారే చెప్పి వేయించారు'' అంది రమణి.

వచ్చేముందు అక్క అందించిన జిప్ బ్యాగులో ఏముందో అర్థమై, బ్యాగ్ తీసుకుని బాత్ రూములోకి వెళ్ళి చీర మార్చుకుని నైటీ వేసుకుంది. అదే బ్యాగ్‌లో అక్క మరిచిపోకుండా పెట్టిన పెర్ఫ్యూమ్ బాటిల్ తీసుకుని 'స్ప్రే' చేసుకుని బయటకు వచ్చింది రమణి.

ఆమె వచ్చి మంచం మీద కూర్చోగానే అంతవరకు కిటికీ అద్దాలలో నుండి బయటకు చూస్తున్న శ్రీనివాస్ నెమ్మదిగా దగ్గరకు వచ్చాడు.

''టి.వి. ఆఫ్ చేసేయనా? ఇది వార్తలు వినాల్సిన సమయం కాదేమో'' అంటూ రమణి మీదుగా వంగి రిమోట్ అందుకున్నాడు.

అతని స్పర్శతో పుక్కిరిబిక్కిరి అయిపోయిన రమణి కళ్ళు మూసుకుని పరవశత్వంలో వుండిపోయింది. ఆమె కాస్త స్థిమిత పడి కళ్ళు తెరిచే సరికి హాచ్ హాచ్ అంటూ నాలుగు సార్లు తుమ్మి, మంచం మీద నుండి లేచి, రుమాలుతో ముక్కు తుడుచుకోసాగాడు శ్రీనివాస్.

''మళ్ళీ పడిశెం పట్టిందా మీకు?'' షాక్ తిన్న రమణి నమ్మలేనట్టుగా అడిగింది.

''అలాగే వుంది'' అంటూ నిస్సహాయంగా చూసి మళ్ళీ తుమ్మాడు శ్రీనివాస్.

కాసేపటికి తుమ్ములు తగ్గాయి కానీ ముక్కు కారడం తగ్గలేదు.

''అయామ్ ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ..'' అంటూ మంచానికి ఒక చివరగా అటువైపు తిరిగి పడుకున్నాడు శ్రీనివాస్. నిరాశగా నిట్టూర్చిన రమణి బదులు పలుకకుండా మంచం మీద ఇంకో చివర తను మరో వైపు తిరిగి పడుకుంది.

శ్రీనివాస్ ముఖం మీదకి దుప్పటి కప్పుకుని అయిదు నిముషాలలో నిద్రపోయాడు గానీ రమణికి మాత్రం ఆలోచనలతో, దిగులుతో ఎంతోసేపటివరకు కళ్ళు మూత పడలేదు.

★ ★ ★

''ఇంటికంటె హోటల్ పదిలమని చెక్కేసారు. ఎలా వుందేమిటి హోటల్ అనుభవం?'' మర్నాడు ఉదయం చెల్లెల్ని వుడికించబోయింది శ్యామల.

''దయచేసి నన్ను మాట్లాడించకక్కా!'' అంటూ విసురుగా అక్కడి నుండి వెళ్ళిపోయింది రమణి.

మధ్యాహ్నం భోజనాలయ్యేదాకా కూడా అలాగే ముభావంగా, అన్యమనస్కంగా, ఏదో సమస్యతో సతమతమవుతున్నదానిలా వుండిపోయింది రమణి. భోజనమయ్యాక అక్కకు కేటాయించిన గదిలోకి వచ్చి, బావ బయటకు వెళ్ళారని తెలుసుకుని అక్కడే పడుకుని నిద్రపోయింది రమణి.

సాయంకాలం అయిదు గంటలవుతుండగా చెల్లెల్ని నిద్ర లేపింది శ్యామల.

''రాత్రివేళ నిద్ర చాలడం లేదని పగటిపూట ఇన్ని గంటలు నిద్ర పనికిరాదమ్మా... లేచి స్నానం చేసి తయారవు.. మరిదిగారు ఎదురుచూస్తుంటారు'' అంది.

''అదొక్కటే తక్కువ..'' దీర్ఘంగా నిట్టూర్చింది రమణి.

''ఏమయిందే? ఎందుకలా వున్నావు? నాతో కాకపోతే ఎవరితో చెప్పుకుంటావ్? అతనేమయినా మొరటుగా గానీ..'' అంటూ ఆగిపోయింది శ్యామల.

''అసలే లేదంటుంటే కొసరు గురించి అడిగినట్టుంది'' అంటూ జరిగిన విషయాలు చెప్పింది రమణి.

''అదేమిటే? ఇంత చిన్న వయసులో పెళ్ళేమిటి అని గోల చేసిన వాడల్లా నిన్ను చూడగానే చాలా ఇష్టంగా పెళ్ళికి ఒప్పుకున్నాడని చెప్పిందిగా వాళ్ళమ్మ'' అంది శ్యామల.

''నాకేం తెలుసునక్కా?'' దిగాలుగా అన్న రమణి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

''నువ్వు మనసులో ఏమీ పెట్టుకోకు. మన ఊరు వెళ్ళాక మీ బావకు తెల్సిన డాక్టరు దగ్గరకు స్నేహితుల ఇంటికని చెప్పి తీసుకు వెడదాం. తరువాత సంగతి ఆయనే చూసుకుంటాడు'' అంటూ ఓదార్చింది శ్యామల.

''చూద్దాం'' అంటూ స్నానానికి నీళ్ళగదిలోకి వెళ్ళింది రమణి.

అదే నిముషంలో లోపలికి వచ్చాడు శ్రీనివాస్. అతని ముఖం ఎర్రగా కందిపోయి వుంది. 'తమ మాటలూనీ విన్నాడేమో' అని భయపడింది శ్యామల.

''అక్కా! ఇక్కడ సబ్బు లేదు. అక్కడ వుందేమో చూసి ఇస్తావా?'' స్నానాల గదిలో నుండి అడిగింది రమణి.

వదినగారి చేతిలో నుండి సబ్బు పెట్టెను తను తీసుకుని ఆవిడ వైపు వేడికోలుగా చూసాడు శ్రీనివాస్.

అర్థం చేసుకున్నట్టుగా గదిలో నుండి నెమ్మదిగా బయటకు నడిచి తలుపులు దగ్గరగా వేసింది శ్యామల.

తను బయటకు రాగానే తలుపు గడియవేయడం వినిపించి నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

గంటసేపటి తరువాత శ్యామల తిరిగి వచ్చేసరికి తలుపులు తీసి వున్నాయి. శ్రీనివాస్ లోపల లేడు. నీళ్ళ గదిలో కూనిరాగం తీస్తూ స్నానం చేస్తోంది రమణి.

''ఏమిటే తల్లీ! ఇంతసేపూ స్నానమేనా?'' తలుపు దగ్గరికి వెళ్ళి అడిగింది శ్యామల.

''ఇంతసేపూ కాదు ఇప్పుడే చేస్తున్నా. అయిపోయిందిలే'' అంటూ చీరను ఒంటికి చుట్టుకుని తలుపు తెరిచి బయటకు వచ్చిన రమణి, అక్కను గట్టిగా కౌగలించుకుని బుగ్గమీద ముద్దుపెట్టుకుని ''అక్కా! ఐయామ్ వెరీ హ్యాపీ'' అంది.

శ్యామల తెల్లబోయి చూసింది.

''ఆయనకు పువ్వులు, సెంటు వాసనలు చిన్నప్పటి నుండి పడవుట అక్కా.. అలర్జీట. అందుకే ఆ జలుబు తుమ్ములు అంతే'' అంది రమణి.

''అంటే.. అసలు విషయం అంతేనని రూఢిగా తెలిసిపోయిందన్నమాట... అంతేనా?'' అనడిగింది శ్యామల నవ్వుతూ.

అవునన్నట్టుగా తలవూపి సిగ్గుపడి కళ్ళు మూసుకుంది రమణి. ☆